RNI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 07-06-2026

# జనసేన నాయకుడు అరెస్ట్

- రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు.
- కేసు నమోదు చేసిన పోలీసులు.
- న్యాయస్థానం ఆదేశాలతో జైలుకు తరలింపు.



2



# క్షతగాత్రులను పరామర్శించిన స్పీకర్

- మర్పల్లి ఘటనపై వెంటనే స్పందన.
- సంగారెడ్డి ఆసుపత్రిలో బాధితుల పరామర్శ.
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు.

2

# ఎండల బారిన ప్రజలకు అభయ హస్తం




2

# చేప ప్రసాదానికి భారీ ఏర్పాట్లు

- భక్తులకు అన్ని సౌకర్యాలు.
- నాంపల్లిలో మంత్రుల పరిశీలన.
- ప్రభుత్వ శాఖల సమన్వయం పై దృష్టి.



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 6:**
మృగశిర కార్తె సందర్భంగా ఈ నెల 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ మంత్రి

- మిగతా 2 లో ...

# జనసేన నాయకుడు అరెస్ట్

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 6:**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు కొర్ర చందర్ లాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహించిన విలేకరుల సమావేశం సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. కొర్ర చందర్ లాల్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయగా, ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మాట్లాడడం చట్టపరంగా నేరమని పోలీసులు



పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం కొర్ర చందర్ లాల్‌ను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా చర్చ సాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

# క్షతగాత్రులను పరామర్శించిన స్పీకర్

**జనం వాయిస్, సంగారెడ్డి, జూన్ 6:**
వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల కేంద్రంలో హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనలో గాయపడిన బాధితులను తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పరామర్శించారు. ఘటన విషయం తెలిసిన వెంటనే ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న స్పీకర్, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని సూచించారు. చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్పీకర్ వెంట ఉండగా, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.



# చేప ప్రసాదానికి భారీ ఏర్పాట్లు

- మొదటి పేజీ తరువాయి ...
వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. పంపిణీ కేంద్రాలు, బ్యారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి ఉక్కపోతను దృష్టిలో ఉంచుకొని క్యూలైన్ల వద్ద ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ ఈ నెల 8వ తేదీ రాత్రి 9 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో తొక్కిసలాటలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంబులెన్సులు, వైద్య శిబిరాలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. క్యూలైన్ల వద్ద సీపీఆర్ బృందాలను ఏర్పాటు చేసి భక్తుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను నియమించడంతో పాటు జేబుదొంగలపై అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ కోసం మత్స్యశాఖ సుమారు లక్షా నలభై వేల కొర్రమీను పిల్లలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు కంట్రోల్ రూమ్ ద్వారా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 176 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

# ఎండల బారిన ప్రజలకు అభయ హస్తం

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 6:**
మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు, రహదారి నిర్మాణ కార్మికులు, నిరాశ్రయులకు ఉపశమనం కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "అభయ హంట్ ది సమ్మర్2026" రెండో దశ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఘనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జెండా ఊపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా పేద, బలహీన వర్గాలపై పడుతుందని గవర్నర్ పేర్కొన్నారు. అలాంటి వర్గాలకు అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతతో చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా మానవతా విలువలను మరింత బలోపేతం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 500 మంది వీధి వ్యాపారులు, కూలీలు, నిరాశ్రయులకు గొడుగులను పంపిణీ చేశారు. ఎండల తీవ్రతలో ఉపాధి కోసం బయట పనిచేసే వారికి ఈ గొడుగులు ఎంతో ఉపయోగపడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. భానుడి ప్రతాపం నుంచి రక్షణ కల్పించడంతో పాటు ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి షార్ ప్రాజెక్ట్స్, యాతపు కన్సల్టింగ్ సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకారం అందిస్తున్నాయి. ఈ కార్యక్రమం కింద తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 3 వేల గొడుగులను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం సుమారు రూ.15 లక్షల వ్యయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి బాలచంద్ర మాట్లాడుతూ సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రస్టీ గుబ్బ విద్యాసాగర్, సహకార సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు కలిసి పనిచేయడం సంతోషకరమని గవర్నర్ పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి చేయూత అందించడం ద్వారా మరింత మానవీయమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.




## ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు

# పోరాటం కొనసాగుతుంది

### రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి

**జనం వాయిస్, మంథని, జూన్ 06:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి మాట్లాడుతూ... ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులను ఏకం చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత కొన్ని రాజకీయ కుట్రలు మొదలయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ప్రకటన అనంతరం జేఏసీలో పనిచేసిన కొంతమంది నాయకులు గత ప్రభుత్వ కాలంలో పదవులు, లబ్ధులు పొందుతూ ఉద్యమకారుల సమస్యలను విస్మరించారని విమర్శించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఉద్యమకారుల హక్కుల కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించని వారు ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చి కమిటీలపై పెత్తనం చేయాలని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మాత్రం 2018 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ ఉద్యమకారుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల అంశాలు చేర్చేందుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అలాగే ఉద్యమకారులను గుర్తించేందుకు కేకే కమిటీ ఏర్పాటు చేయాలంటూ పలు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిందన్నారు. జేఏసీపై తమకు గౌరవం ఉందని, కానీ ఉద్యమకారుల కమిటీలో కొందరు ఆధిపత్యం చెలాయించే ప్రయత్నాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, కమిటీ సభ్యులు నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు.



## కవితను కలిసిన మాష్టి, మాస్టిన్

# హక్కుల పోరాట సమితి నాయకులు.

### తమ సమస్యలు,హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కవితకు విజ్ఞప్తి.

**హైదరాబాద్, జనం వాయిస్, జూన్ 6:** హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సంచార జాతుల జాతీయ కార్యనిర్వహక అధ్యక్షులు కత్తి మల్లయ్య ఆధ్వర్యంలో,మాష్టి,మాస్టిన్ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నాగిళ్ల నరసయ్య ఆధ్వర్యంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా కుల సమస్యలపై ఎస్సీలలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మా యొక్క కులముకు అందడం లేదని,కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ఆర్డిఓ ద్వారా జారీచేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కవిత దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మార్వో ద్వారా ఇప్పించగలరని మాష్టి,మాస్టిన్ రెండు వర్గాలుగా ఉన్న ఈ యొక్క కులం ఒకే కులానికి చెందిందని,కావున ఈ యొక్క రెండు నెంబర్లు,10,మాష్టి,12,మాస్టిన్ ఒకే బ్రాకెట్లో చేర్చేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా చదువుకున్న విద్యార్థులు ఉద్యోగం పొందలేక పోతున్నారని,ఇందిరమ్మ ఇండ్లు కూడా ఇప్పియ్యాలని,ఎస్సీ కార్పొరేషన్ లోన్లు అందేలా చూడాలని రాష్ట్ర అధ్యక్షులు నాగిళ్ల నరసయ్య కవితని కోరడం జరిగిందన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో మాష్టి, మాస్టిన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగిళ్ల కిష్టయ్య,ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజలింగం,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దర్శనం రాములు ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఇటికాల కొండయ్య,మహబూబాద్ జిల్లా పొన్నాల మహేష్,జనగాం జిల్లా అధ్యక్షులు నాగిళ్ల నాగరాజ్, ఉపాధ్యక్షులు బత్తిని పరుశరాములు,యాదాద్రి భువనగిరి,జిల్లా బత్తిని గోవిందు, రాష్ట్ర నాయకులు బత్తిని నరసయ్య,నాగేళ్ల సైదమ్మ,నాగిళ్ల హరికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.



## కళాకారుడికి సన్మానం

**జనం వాయిస్, మంథని, జూన్ 6:** మంథని కి చెందిన ప్రముఖ గాయకుడిగా పేరుగాంచిన ఏట రవిని తెలంగాణ భాష సాంస్కృత శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నటువంటి కళాకారులను ఘనంగా సన్మానం చేశారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఏవో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంథని పట్టణానికి చెందిన తెలంగాణ కళాకారులు ఏట రవిని ఘనంగా సన్మానిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు దుబాసి శ్రీనివాస్, చిలుక సమన్న, మమత, మామిడి విష్ణు, అంజలి, మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.




## 21న ఉద్యమకారుల ఆత్మీయ

# సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి డాక్టర్ కావటి సతీష్

**జనం వాయిస్, మంథని, జూన్ 6:** జూన్ 21న హైదరాబాదులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి డాక్టర్ కావటి సతీష్ పిలుపునిచ్చారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కావటి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కేకే కమిటీ ఉద్యమకారులకు వెంటనే సమగ్ర న్యాయం చేయాలని కోరారు. త్వరలో మంథని మండల ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని పార్టీలకతీతంగా ఉద్యమకారులు రావాల్సిందిగా కోరుతున్నామన్నారు. నకిలీ ఉద్యమకారులను ఏరి వేసేందుకు అసలైన ఉద్యమకారులను గుర్తింపు లభించేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ఉద్యమ రాష్ట్రాలైన చతిస్గడ్, జార్ఖండ్, అస్సాం రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా తెలంగాణలో సైతం పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఉద్యమ సమయంలో పోలీస్ కేసులతో ఉద్యోగ అవకాశాలు రాక ఇబ్బందులు పడ్డ ఉద్యమ కారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నోటిఫికేషన్లలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉద్యమ నాయకులు తోకల మల్లేష్ మాట్లాడుతూ తప్పనిసరిగా నకిలీ ఉద్యమకారులను ఏరివేస్తామన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే ఉద్యమకారులను గుర్తించి భూమితో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. అదేవిధంగా ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు అందించి జీవనోపాధి కల్పించాలన్నారు. కేకే కమిటీని నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు చిదురాల మధుకర్ రెడ్డి, ముస్కె ఈశ్వరమ్మ, మిరాల రాంరెడ్డి, అక్కపాక సంపత్, ఆకుల అరుణ్, కొరవేన కుమార్, కట్టెకోళ్ల విజయ్, గడ్డం మనోజ్, కొత్తకొండ నాగరాజు, రాసకొండ రవీందర్, మంతెన సాయికుమార్ లు పాల్గొన్నారు.



## ఆపదలో కుటుంబానికి అండగ నిలిచిన గంగపుత్ర సంఘం

**జనం వాయిస్, మంథని, జూన్ 6:**
కుటుంబానికి పెద్దన్నల ఆపదలో గంగపుత్ర సంఘం అండగా నిలిచింది. మంథని మండలం బెస్తపల్లి గ్రామానికి చెందిన బోరే సంపత్ ముంబైలో జరిగిన రైలు ప్రమాదంలో గత ఏడాది నవంబర్ 13న మృతి చెందారు. మృతుడి కుటుంబ పరిస్థితులు తెలుసుకొని బెస్తపల్లి, గట్టుప్పల్, కామరాజు నగర్, ముంబై గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ గంగపుత్ర సంఘాల ద్వారా గంగపుత్ర సంఘం నాయకులు, తెలుగు యూత్ సేవా సంఘం సభ్యులు తోకల మల్లేష్, తెలుగు యూత్ సేవా సంఘం ముంబై నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. విరాళాల రూపంలో వచ్చిన రూ. 1, 33, 530 నగదులో 1,27, 375 రూపాయలను మృతుడు సంపత్ ముగ్గురు పిల్లలకు ఎల్ఐసి లో 20 సంవత్సరాలు ఫిక్స్ డిపాజిట్ చేశారు. మిగిలిన రూ.6,155 లను సంపత్ భార్య స్వరూపకు అందజేశారు. ఆపదలో అండగ నిలిచిన గంగపుత్ర సంఘం నాయకులకు, సహకరించిన తోకల మల్లేష్, దాసరి రాజు లకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్తపల్లి సర్పంచ్, గంగపుత్ర సంఘం నాయకులు, దుబ్బపల్లి గ్రామస్తులు, ముంబై గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో స్త్రీ రైడ్స్ ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ

**జనం వాయిస్, హైదరాబాద్:జూన్ 06**
తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ శనివారం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలకు 2 వీలర్, త్రీ వీలర్ వాహనాల డ్రైవింగ్ నైపుణ్యాలను నేర్పిం చి వారిని స్వయం సమృద్ధులుగా మార్చ డమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం, మొదటి విడుతలో భాగంగా ఎంపిక చేసిన 55 మంది మహిళల కు అంబర్ పేట్ పోలీస్ లైన్స్ లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేకంగా డ్రైవింగ్ శిక్షణ ఇప్పిం చి రవాణా రంగంలో మహిళలపై జరిగే వేధింపులకు అడ్డుకట్ట వేస్తూ, తోటి మహిళ లను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఈ స్త్రీ రైడర్లును సిద్ధం చేస్తున్నారు. ఈ డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... ప్రజా పాలన- ప్రగతి ప్రణా ళిక కార్య క్రమంలో భాగంగా మహిళ సాధికారత సాధించడ మే లక్ష్యం గా ఈ స్త్రీ రైడ్స్ ప్రాజెక్టును తీసుకొచ్చామన్నారు.




## మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ పై దర్యాప్తుకు ఆదేశించిన

# జాతీయ ఎస్ టి కమిషన్.

**మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ రద్దుకై సాగునీటి పోరాటంలో ముందడుగు. హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల.**

**జనం వాయిస్ -గార్ల -జూన్ 06:**
ప్రతిపాదిత మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు ద్వారా గిరిజన ప్రాంతాలకు, స్థానిక ఎస్,టి జనాభాకు జరిగే తీవ్ర అన్యాయంపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఎస్ , సి, ఎస్,టి, అత్యంత ప్రాధాన్యతతో స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి నోటీసులు జారీ చేయడం పట్ల తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల హర్షం వ్యక్తం చేశారు. ఈమెరకు శనివారం గార్ల మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, రైతుల సమన్వయంతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశ్వ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జీవో నెంబర్ 98ని తక్షణమే రద్దు చేయాలని, గిరిజనుల హక్కులను కాల రాసేలా సాగుతున్న పనులను నిలిపివేయాలని కోరుతూ గత ఏప్రిల్ 16, 2026న స్థానిక గిరిజన రైతులతో కలిసి జాతీయ ఎస్టీ కమిషన్‌కు సమగ్రమైన ఫిర్యాదు (పిటిషన్) సమర్పించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన కమిషన్ (ఫైల్ నెం. ఎస్ సి ఎస్ టీ /డి ఈ వ్ -7762/టి ఎస్ /1402/2026-రో -భూవ్ /రు -III), భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ కింద ఉన్న అధికారాల ప్రకారం పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డైరెక్టర్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌లకు జాతీయ ఎస్టీ కమిషన్ అధికారిక నోటీసులు పంపింది. ఈ ప్రాజెక్టు తోపాటు జీవో 98 రద్దు అంశంపై తీసుకున్న చర్యలు, వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను నోటీసు అందిన 30 రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించిందని తెలిపారు. నిర్ణీత గడువులోగా సరైన సమాధానం లేదా నివేదిక రానట్లయితే, సివిల్ కోర్టుకు ఉండే అధికారాల ప్రకారం కమిషన్ సమన్లు జారీ చేసి అధికారులను వ్యక్తిగతంగా ఢిల్లీ లేదా ప్రాంతీయ కార్యాలయానికి హాజరు పరుస్తుందని ఆదేశించిందని తెలిపారు. చట్ట విరుద్ధంగా, స్థానిక ఏజెన్సీ గిరిజన, ఆదివాసిల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా చేపట్టిన మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు వల్ల వందలాది ఏజెన్సీ గిరిజన కుటుంబాలు భూములు కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉంది. ఈ అనాలోచిత ప్రాజెక్టుపై జాతీయ కమిషన్ స్పందించడం బాధితులకు దక్కిన తొలి విజయం. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం, స్థానిక జిల్లా యంత్రాంగం మొండి వైఖరి వీడి, జీవో నెం. 98ని రద్దు చేసి, ఈ ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలి" అని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గిరిజన హక్కుల పరిరక్షణ కోసం, వారి అడవి, భూమి హక్కుల కోసం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గుగులోత్ సక్రు, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రైతు సంఘం నాయకులు కత్తి సత్యం, పల్లెబోయిన లింగయ్య, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు భూక్యా హరి నాయక్, అంబటి వీరస్వామి, బాదావత్ చంటి, జనార్ధన్, మీగడ శ్రీనివాస్, అశోక్, శ్యామ్, రాజేంద్రప్రసాద్, శేరిపురం మాజీ సర్పంచ్ సక్రు తదితరులు పాల్గొన్నారు.



# సివిల్ డ్రస్ లో తాను "ఓ సామాన్యుడిలా"

**అర్ధరాత్రి ద్విచక్ర వాహనం పై అనుమానిత ప్రాంతాల్లో గార్ల ఎస్సై బి.సాయికుమార్ ఆకస్మిక తనిఖీలు.**
**నిరంతర నిఘా,**
**అనుమానితులకు అక్కడికక్కడే పరీక్షలు.**
**నేరం రుజువైతే కఠిన శిక్షలు తప్పవు.**
**ఎస్సై బి. సాయికుమార్.**





**జనం వాయిస్ -గార్ల -జూన్ 06:** మహబూబాబాద్ జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు గార్ల ఎస్సై బి.సాయి కుమార్ తమ సిబ్బందితో అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గార్ల పట్టణ పరిసర ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమి గూడె ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై ఆరా తీశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని,అలా చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయదారులు సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. గంజాయి విక్రయాలు, రవాణా,నిల్వ, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినవారు తమకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# మంచిర్యాల - హైదరాబాద్‌కు జాతీయ రహదారి నిర్మించాలి.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రఘునాథ్ వెరబెల్లి వినతి.**
**రాజీవ్ రహదారి సమస్యల పరిష్కారానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి.**

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 06:** హైదరాబాద్: మంచిర్యాల – హైదరాబాద్ మధ్య ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారి వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరించడానికి నూతనంగా జాతీయ రహదారిని నిర్మించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి శనివారం హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన నాగ్‌పూర్ – హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ హైవేను చంద్రపూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట మీదుగా హైదరాబాద్ వరకు నిర్మించేలా ఉన్న అవకాశాలను పరిశీలించాలని, దీనిపై కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారితో మాట్లాడాలని కిషన్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతాల మీదుగా నూతన జాతీయ రహదారిని నిర్మిస్తే రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, వాహనదారుల ప్రయాణం సురక్షితంగా మరియు సులభతరంగా మారుతుందని



రఘునాథ్ వెరబెల్లి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణి యాజమాన్యం దౌర్జన్యం.

**- భూనిర్వాసితుల పట్ల అనుసరిస్తున్న వైఖరి నిజాం పాలనల ఉంది.**
**- బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్.**

**జనం వాయిస్, రామగిరి, జూన్ 6:** రామగిరి మండలంలో సింగరేణి యాజమాన్యం భూనిర్వాసితుల పట్ల అనుసరిస్తున్న వైఖరి నిజాం పాలనను తలపించే విధంగా ఉందని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. భూనిర్వాసితులు తమ వ్యక్తిగత అవసరాల కోసం, ముఖ్యంగా కూతురు వివాహం, కుటుంబ అత్యవసర ఖర్చులు, తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సల కోసం తమ ప్లాట్లు లేదా ఆస్తులను విక్రయించుకోవాలనుకుంటే, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కలెక్టర్ ఆదేశాలున్నాయని చెప్పి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకోవడం అధికారుల నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజల ఆస్తులపై హక్కులను కాలరాస్తూ,



భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. సింగరేణి ఏరియా-3 అధికారులు ఆడుతున్న ఈ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు" అని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఒక సర్వే నంబర్‌లో 50 ఎకరాల భూమి ఉండి, సింగరేణికి కేవలం 20 ఎకరాలు మాత్రమే అవసరమైనప్పటికీ, మొత్తం సర్వే నంబర్‌లో ఉన్న భూములన్నింటిపై రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అన్యాయమని ఆయన అన్నారు. అవసరమైన భూమిని మాత్రమే స్వాధీనం చేసుకోవాల్సిన చోట, సంబంధం లేని భూముల యజమానుల హక్కులను కూడా హరించడం సమంజసం కాదన్నారు. అంతేకాకుండా, రామగిరి మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో 10 నుండి 15 సంవత్సరాల క్రితం భూనిర్వాసితులకు పునరావాసంలో భాగంగా కేటాయించిన భూములు, ప్లాట్లు మరియు ఆస్తుల రిజిస్ట్రేషన్లను కూడా ప్రస్తుతం అడ్డుకోవడం మరింత అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గతంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో కేటాయించిన ఆస్తులపై నేడు ఆంక్షలు విధించడం వల్ల భూనిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. భూనిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఈ అంశాన్ని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, భూనిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరంగా హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ప్రజల హక్కులను కాలరాసే చర్యలను సహించబోమని, భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని మొలుమూరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సెంటినరీ కాలని పట్టణ అద్యక్షుడు తీగల శ్రీధర్, బిజెపి సీనియర్ నాయకులు మేరుగు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ కలల స్వరాజ్యం... నేటి పార్టీల రాజ్యం!

## జనం వాయిస్,

ఒకప్పుడు ఈ దేశంలో ఒక మహాత్ముడు అన్నాడు గ్రామ స్వరాజ్యమే నిజమైన స్వరాజ్యం. ఆ మాటలు ఇప్పుడు చరిత్ర పుటల్లో బంధీ అయ్యాయి. నేడు స్వరాజ్యం అంటే పార్టీ రాజ్యం. ప్రజాస్వామ్యం అంటే పార్టీస్వామ్యం. ఓటు వేసే హక్కు మాత్రమే ప్రజలకు మిగిలింది నిర్ణయించే అధికారం పార్టీ కార్యాలయాల చీకటి గదుల్లో ముడుచుకుపోయింది.

ఈ దేశ రాజ్యాంగం ప్రజలను సార్వభౌమాధికారులుగా ప్రకటించింది. కానీ ఆ ప్రకటన నేడు కేవలం ఒక అందమైన అబద్ధంగా మారింది. ప్రజలు ఏదైనా నిర్ణయిస్తున్నారా? లేదు. పార్టీ అధ్యక్షుడు నిర్ణయిస్తున్నాడు. ప్రజలు ఏదైనా మారుస్తున్నారా? లేదు. పార్టీ హైకమాండ్ మారుస్తోంది. ప్రజలు ఎవరిని గెలిపిస్తారా? అది కూడా పార్టీ అధిష్ఠానం చెప్పిన వారినే గెలిపించే పరిస్థితి వచ్చింది. ఇది ప్రజాస్వామ్యమా? లేక ప్రజల పేరుతో సాగుతున్న పార్టీ నిరంకుశత్వమా?

ప్రతి ఐదేళ్లకోసారి ఈ దేశంలో ఒక మహాయజ్ఞం జరుగుతుంది. వందల కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. కోట్లాది ప్రజలు పొడవైన క్యూలలో నిలబడతారు. వేళ్లకు సిరా పూస్తారు. ఆ సిరా పూసిన వేలు గాల్లో ఎగురవేసి, మేం ఓటేశాం! అని గర్వంగా సామాజిక మాధ్యమాల్లో చెప్పుకుంటారు. టీవీ కెమెరాలు తిరుగుతాయి. పత్రికలు పతాక శీర్షికలు వేస్తాయి. ప్రజాస్వామ్య విజయం! అని నినాదాలు మిన్నుముట్టతాయి.మీరు ఓటేసే అభ్యర్థిని నిజంగా మీరే ఎంచుకున్నారా? లేదు, పార్టీ ఎంచుకుంది. మీరు ఓటేసే విధానకర్తను మీరు నిర్ణయించారా? లేదు, పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ మేనిఫెస్టో రాసింది ఎవరు? ప్రజలా? కాదు, ఒక్క ఏసీ గది లోపల కూర్చున్న కొందరు సిద్ధాంతకర్తలు. అది అమలు చేసేది ఎవరు? మీరు ఎన్నుకున్న ప్రతినిధా? కాదు, పార్టీ ఆదేశాలు అనుసరించే విధేయుడు మాత్రమే. అప్పుడు మీ ఓటు ఏమి చేస్తోంది? మీరు వేస్తున్నది ప్రజాస్వామ్యానికి ఓటా? లేక పార్టీ యంత్రానికి ఓటా?భారత రాజ్యాంగ నిర్మాతలు ఎన్నో కలలు కన్నారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రజల మధ్య జీవించే, ప్రజల బాధలు అర్థం చేసుకునే, ప్రజల తరపున పోరాడే నాయకులు ఎన్నికవుతారని వారు ఆశించారు. కానీ నేడు అభ్యర్థి ఎంపిక ఎక్కడ జరుగుతోంది? హైదరాబాద్‌లోని ఏసీ గదులలో, ఢిల్లీలోని పార్టీ కార్యాలయాల్లో, ముంబైలోని ఐదు నక్షత్రాల హోటళ్లలో.ఆ నియోజకవర్గంలో పుట్టి పెరిగిన వ్యక్తికి, పదేళ్లుగా ప్రజల్లో ఉన్నవాడికి టిక్కెట్ రాదు ఎందుకంటే అతనికి పార్టీ పెద్దలతో పరిచయం లేదు. ఏ రాష్ట్రంతోనూ, స్థానిక సమస్యలతోనూ సంబంధం లేని వ్యక్తికి టిక్కెట్ వస్తుంది ఎందుకంటే అతడు కోట్లు కుమ్మరించగలడు. ఇది అర్హతా? నైపుణ్యమా? ప్రజాసేవా? లేక పక్కా వ్యాపారమా?ఒక్క ప్రశ్న అడగండి మీ నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో మీకు ఒక్క నిమిషం పాత్ర ఉందా? ఆ పేరు ప్రకటించే ముందు మీ అభిప్రాయం అడిగారా? మీ ప్రాధాన్యత లెక్కలోకి తీసుకున్నారా? లేదు. అప్పుడు మీరు ఓటరా? లేక పార్టీ నిర్ణయాన్ని ఆమోదించే రబ్బరు స్టాంపా?పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. ఒక కీలకమైన చట్టం మీద చర్చ జరుగుతోంది. మీ ప్రతినిధి అసెంబ్లీలో కూర్చున్నాడు. అతని మనసులో ఒక అభిప్రాయం ఉంది. అది మీ ప్రాంత ప్రయోజనానికి అనుకూలమైనది. కానీ పార్టీ విప్ జారీ చేసింది పార్టీ లైన్ మాత్రమే ఫాలో అవ్వండి. ఆ క్షణంలో మీ ప్రతినిధి ఏం చేస్తాడు?

మీకు న్యాయం చేస్తాడా? లేక పార్టీకి విధేయంగా ఉంటాడా?మీకు తెలుసు సమాధానం. పార్టీకి విధేయుడవుతాడు. ఎందుకు? ఎందుకంటే తిరుగుబాటు చేస్తే పార్టీ సభ్యత్వం పోతుంది. తదుపరిసారి టిక్కెట్ రాదు. రాజకీయ భవిష్యత్తు చీకటిలో కూరుకుపోతుంది. అంటే అతడు మీ ప్రతినిధి కాదు పార్టీ ప్రతినిధి. మీ ఓటు అతన్ని పంపింది, కానీ అతని విధేయత మీకు కాదు పార్టీకి.ఇది రాజ్యాంగంలోని పదో షెడ్యూలు అంటే పార్టీకి విరుద్ధంగా ఓటేస్తే అనర్హత. ఈ నిబంధన అసలు ఎవరికోసం? ప్రజలకోసమా? కాదు, పార్టీల ఐక్యత కోసం. ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రకారం ప్రతినిధి తన మనసాక్షికి కట్టుబడి ఓటేయాలి కానీ ఈ చట్టం అతని మనసాక్షిని కూడా పార్టీకి తాకట్టు పెట్టింది.

ఆధునిక భారత రాజకీయ పార్టీలు ప్రధానంగా మూడు అస్త్రాలను వాడుతున్నాయి.మొదటిది డబ్బు ఎన్నికల సమయంలో వేల కోట్లు ఖర్చవుతున్నాయి. ఆ డబ్బు ఎక్కణ్ణుంచి వస్తోంది? కార్పొరేట్ శక్తుల నుండి, పారిశ్రామిక దిగ్గజాల నుండి. ఎన్నికైన తర్వాత ఆ నాయకుడు ఎవరికి జవాబుదారీగా ఉంటాడు? ప్రజలకా? కార్పొరేట్లకా? సమాధానం వారి విధానాలే చెబుతున్నాయి.రెండవది కులం భారతదేశంలో ఓటుబ్యాంకు రాజకీయాలు కులాన్ని ఒక వ్యాపారసరుకుగా చేసుకున్నాయి. ఫలానా కులానికి ఈ పార్టీ ఫలానా వర్గానికి ఆ పార్టీ ఈ విభజన ప్రజలను పార్టీ ప్రయోజనానికి విభజించే యంత్రమైంది. ఓటింగు అయిన తర్వాత కులం గుర్తే ఉండదు.మూడవది కుటుంబం ఒక రాజకీయ కుటుంబం అనేక తరాలుగా అధికారాన్ని వారసత్వ ఆస్తిగా పంచుకుంటోంది. తండ్రి అధ్యక్షుడయ్యాడు, కొడుకు ముఖ్యమంత్రి అయ్యాడు, కూతురు మంత్రి అయింది. ఇది ప్రజాస్వామ్యంలో ప్రజా ఆమోదమా? లేక రాజతంత్రంలో వారసత్వ రాజ్యమా?ఒకప్పుడు మీడియా నాల్గవ స్తంభంగా నిలబడేది. నేడు పెద్ద మీడియా సంస్థలు పెద్ద పార్టీలకు అనుబంధ యంత్రాంగాలు అయ్యాయి. ఏ ఛానెల్ ఏ పార్టీ అజెండా నడుపుతుందో ప్రజలకు తెలుసు. సోషల్ media లో పార్టీ ఐటీ సెల్లు లక్షల ఫేక్ అకౌంట్లు నడుపుతున్నాయి. తప్పుడు నేరేటివ్‌లు తయారుచేస్తూ ప్రజల అభిప్రాయాన్ని కృత్రిమంగా మారుస్తున్నాయి. అంటే నేడు ఒక సామాన్య పౌరుడు ఏం చూస్తాడో, ఏం చదువుతాడో, ఏం నమ్ముతాడో అది కూడా పార్టీలు నిర్ణయిస్తున్నాయి.ఇక్కడ నిరాశ వద్దు. ఆగ్రహం అవసరం కానీ సంస్కరణ దిశగా:వ్యవస్థలో పేరుకుపోయిన ఈ రుగ్మతలను చూసి మనం నిరాశ చెందాల్సిన అవసరం లేదు,కానీ సంస్కరణల దిశగా ఒక బలమైన పౌర ఆగ్రహం వ్యక్తమవ్వాలి. ఇందుకోసం అత్యవసరంగా మారాల్సింది అభ్యర్థుల ఎంపిక విధానం. పార్టీ హైకమాండ్ల మూసి ఉన్న గదుల్లో కాకుండా, నియోజకవర్గ ప్రజలే తమ ప్రతినిధిని నేరుగా ఎంచుకునే ప్రైమరీ విధానం రావాలి. అలాగే, రాజకీయ నిధుల సేకరణలో పూర్తి ఆర్థిక పారదర్శకత ఉండాలి; పార్టీకి వచ్చే ప్రతి రూపాయి లెక్క ప్రజల ముందు ఉంచినప్పుడే అపారదర్శక నిధులు, కార్పొరేట్ శక్తుల పెత్తనం అంతమవుతాయి. వీటన్నింటితో పాటు, స్థానిక సంస్థలైన పంచాయతీలు, నగరపాలక సంస్థలకు పార్టీల రిమోట్ కంట్రోల్ లేని స్వతంత్ర అధికారాలు దక్కాలి. వీటన్నింటికీ ఆలంబనగా నిలవాల్సింది నేటి యువత. కేవలం పార్టీ జెండాలు మోయడానికి పరిమితం కాకుండా, RTI దరఖాస్తులు వేస్తూ, స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీస్తూ నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములు కావాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ సాధ్యమవుతుంది.ఈ వ్యాసం చదివాక ఒక్క క్షణం ఆగండి. మీ గుండె లోతున ఒక ప్రశ్న అడగండి నేను నిజంగా సార్వభౌముడిని? లేదా పార్టీ రాజ్యంలో ఒక సాధారణ పావుని? ప్రజాస్వామ్యం ఒక జీవన్మరణ సమరం. అది పార్టీల వల్ల చనిపోదు ప్రజలు మేల్కొనకపోవడం వల్ల చనిపోతుంది. పార్టీలు అసమర్థంగా ఉంటే అది వారి తప్పు. కానీ మనం వారిని సహిస్తే అది మన తప్పు.జాతిపిత బాపూజీ చెప్పాడు మీరు మార్పు చూడాలనుకుంటే, మీరే ఆ మార్పు అవ్వండి.పార్టీలు మారవు, వ్యవస్థలు మారవు. మన ఆలోచన మారాలి, మన ఓటు వేసే విధానం మారాలి. పార్టీస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాటం బ్యాలెట్ పేపర్ నుండే మొదలవుతుంది. కానీ అది మొదట మన మనసులో మొదలవ్వాలి. ప్రజలు మేల్కొనే రోజే నిజమైన ప్రజాస్వామ్యానికి తొలి తెల్లవారుజాము.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169